

# రక్తమా నీదే కులం!

'రాధిక'

"గాలికి, వానకు, వరదకు, ఆకలికి, బాధకు, భాషకు - వేటికీ కులం లేదు. అన్నీ అందరికీ సమానమే. ప్రకృతి, ఎండ, నీడ - అన్నీ మనుషుల నందరినీ సమానంగానే చూస్తాయి. కాని, మనిషి మాత్రం తక్కువ కులం వాడైన తన తోటి మనిషిని సమానంగా చూడలేడు." చదవడంలో లీనమై పోయిన తన కళ్ళు ఎవరో వెనుక నుంచి మూయడంతో ఒక్కసారి ఉలిక్కి పడింది సమీర. ఆ కొంటె పని ఎవరిదో కూడా తెలును. రవికి తప్పించి ఎవరికి ఉంది ఆ అధికారం? తన సుతిమెత్తని చేతులతో అతని చేతులు తప్పించబోయింది. తన కళ్ళ మీదున్న ఆ చేతుల్ని ఆ నిమిషంలో అవే పెదవులన్నట్లు కళ్ళతోనే మనసులో ముద్దు పెట్టుకుంది. తన మెడలో మూడు ముళ్ళు వేసిన అతని చేతులు, తనతో ఏడడుగులు నడిచిన ఆ కాళ్ళు, తన శరీరంలో శరీరం అయిన అతనిమేను, అన్నింటికీ మించి రక్తమాంసాలతో కాక వెన్నతోను, మంచితనంతోను చేసిందా అనిపించేటంతటి అందమైన, ఆదర్శవంతమైన అతని హృదయం, దేవుడంటే ఇలాగే ఉంటాడా అనిపించే విధంగా ప్రేమతో మైమరపించే అతని ప్రవర్తన ప్రపంచంలో దేనికీ సాటిరావు.

రవి తన చేతులు తీసి మెడ మీదుగా ఆమె గుండె మీద వేసి, బుగ్గ మీద ముద్దు పెట్టుకున్నాడు. "ఏమిటోయ్. పతిదేవుడు వచ్చి పది నిమిషాలైనా ఆ వారఫలాలు తెగ చదివేస్తున్నావు. నీవు పుట్టిన నక్షత్రమేమిటో తెలియదన్నావు. అన్నిటిలో ఏ రాశి బాగుంటే అదే ఈ వారానికి నీకు అన్వయించుకుంటున్నావా?" అని సరదాగా అన్నాడు. నిజమే. సమీరకు తను ఎప్పుడు పుట్టిందో కూడా తనకే తెలియదు. నిరక్షరాస్యులైన తన తల్లితండ్రులు సంక్రాంతికి ముందు వచ్చిన పౌర్ణమి నాడు అంటారు. సంవత్సరం అంతకంటే తెలియదు. సర్టిఫికెట్‌లో ఉజ్జాయింపుగా తనే వేసేసుకుంది. తల్లితండ్రులు ఎంత చదువు లేనివారైనప్పటికీ చాలా కష్టపడి తనను ఇంటర్ వరకూ చదివించారు. తరువాత మెడిసిన్ ఒక మహానుభావుడు చదివించాడు. అంతటితో ఊరుకోలేదు. అతని కొడుకు ని ఇచ్చి వివాహం చేసి ఆ ఇంటికి అధికారిని చేశాడు. రవి తండ్రికి చదువంటే మహా ఇష్టం. సమీరకున్న అత్యంత తెలివి తేటలు చూసి ఆయన ఎంతో మురిసిపోయారు. మురిసిపోయి ఊరుకోలేదు. తన కొడుకుతో చెప్పి ఆయన కోడలిగా చేసుకున్నారు. కులం గురించి ఆయన తలపలేదు. కారణం- ఆయన కూడా కులాంతర వివాహం చేసుకోవడమే.

విధి ఎంతో విచిత్రమైంది. కూలి పని చేసుకునే వాడి కడుపున పుట్టిన సమీర కోటీశ్వరుడి కోడలైంది. సమీర మామగారు సమీర తెలివితేటలకే ప్రాధాన్యం ఇచ్చారు. ఆయనకు ఎంత డబ్బున్నా తన భార్యా, కూతురూ సరైన వైద్యం లేక మరణించడం ఆయన జీవితంలో పెద్ద అశనిపాతం. అందుకే సమీరకు చదువు మీద ఉన్న దీక్షతో పాటు ఆమె వినయ విధేయతలు, అందచందాలు ఆయనను బాగా ఆకర్షించాయి. ఆమె తన మాట విని, ఆ పల్లెలో ప్రాక్టీసు పెడుతుందనే నమ్మకం కలిగి ఆమెను చదివించారు. అంతేకాదు. అలాంటి అన్ని మంచి లక్షణాలున్న అమ్మాయిని మరొకరి చేతులలో పెట్టడం ఆయనకు ఇష్టం లేదు. మొదట్లో సమీరను కోడలిని చేసుకునే ఉద్దేశం లే దాయనకు. కాని, రవి ఇష్టపడుతున్నాడనీ, ఆమె అతనికి దూరంగా వెళ్ళిపోవాలని ప్రయత్నిస్తూందనీ తెలిసి కొడుకు మనసుకు నచ్చినట్లుగా ఆమెను కోడలిగా చేసుకున్నారు. రవికి భార్యంటే పంచప్రాణాలు. బ్రహ్మదేవుడు తన కృషికి నిదర్శనంగా ఆమెను సృష్టించినట్లు భావిస్తాడు రవి. కులం, పేదరికం అతని మనసులోని ప్రేమకు అడ్డు రాలేదు. రవి ఆమె అందాన్ని ఎంతగా ఆరాధిస్తాడో, ఆమెలోని మంచితనానికి, సంస్కారాని అంతగానూ అభినందిస్తాడు. హాస్పటల్ పని, ఇంటి పని కూడా ఇద్దరూ సమానంగా చేసుకుంటారు.

ఆరేళ్ళ హారిత "మమ్మీ, ఆకలి" అంటూ స్కూలు నుంచి పరుగెత్తుకు వచ్చింది. హారితకు, హారికి టిఫిన్ పెట్టి, తాను తీసుకుంది సమీర. హారితను చూస్తుంటే తన చిన్ననాటి రోజులు గుర్తుకు వస్తాయి ఆమెకు. ఆ వయసులో తను అ, ఆ లు దిద్దుకుంటూ, తమ్ముణ్ణి ఆడిస్తూ అమ్మా, నాన్నా పని నుంచి వచ్చేసరికి చిరిగిన గౌనుతో, చీమిడి ముక్కుతో వచ్చీ రాని వంట సిద్ధం చేసి ఉంచేది. అప్పుడప్పుడు సెలవుల్లో తండ్రి పని చేసే మేడకు వెళ్ళి తండ్రితో పాటు తోటకు నీళ్ళు పెట్టి, చెట్లకు చుట్టూ గట్టు కట్టేది. ఆ పువ్వులను చూస్తూ మైమరచిపోయేది. ఇంటి యజమానురాలు అప్పుడప్పుడూ సంతోషంగా ఇచ్చే డబ్బులతో పుస్తకాలు కొనుక్కొనేది, గౌనులు మానిసి. ఆ మూడంతస్తుల మేడ చూసి 'ఆ మేడలోని వారు మేడ పై నుంచి చందమామను అందుకుంటారు కాబోలు' అని సమీర చిన్నారి హృదయం భ్రమపడేది. చందమామ పేదవారికీ, గొప్పవారికి కూడా అందదని, అది అందరికీ సమానంగా చల్లదనాన్ని ఇస్తుందని, దానికి తరతమ భేదాలు లేవని, ఆ భేదాలన్నీ ఆ ఇంటిలోని వారికే అని ఆ పసిమనసుకు తెలియదు. ఆ ఇంటిగలావిడ అప్పుడప్పుడు చిల్లర డబ్బులిచ్చినా, సమీర చిరిగిన గౌను చూసి చీదరించుకునేది.

రవి గబగబ తయారై అప్పుడే గేరేజ్‌లో నుంచి కారు తీసి హారన్ కొట్టాడు. ఉలిక్కిపడి హారితకు 'టా టా' చెప్పి ఉరుకులు పరుగులతో కారులో కూలబడింది సమీర. రవి చెయ్యి ఒకటి సమీర మీద, మరొకటి స్టీరింగ్ మీద వేశాడు. ప్రశాంతి నర్సింగ్ హోమ్ ముందు కారాగింది, పేరుకి తగినట్లుగానే ప్రశాంతంగా ఉంది ఆ హాస్పటల్ వాతావరణం కూడా. రక రకాల పూల చెట్లు చల్లని గాలికి సుతారంగా తలలూపుతూ అందరినీ రమ్మని ఆహ్వానిస్తుంటే, శాంతిస్వరూపులై, తెల్లని దుస్తులు ధరించిన సిస్టర్స్ చిరునవ్వులతో పేషంట్స్‌ని రిసీవ్ చేసుకుంటున్నారు. 'సహృదయంతో సేవలు చేస్తాం. చిరు నవ్వులతో రోగిని చూస్తాం. మంచి మాటలతో ధైర్యం చెబుతాం. ఆపైన మందులు ఇస్తాం' అంటున్నట్లున్నారు ఆ హాస్పటల్‌లోని స్టాఫ్ అంతా! మానవ సేవే మాధవ సేవకు ప్రతిరూపం ఆ హాస్పటల్. "డబ్బుతో కొనలేనిది, దేవుణ్ణి ఎదిరించి సాధించలేనిది ప్రాణం. దానిని జాగ్రత్తగా కాపాడడం మా ధర్మం" అంటారు రవి, సమీర.

ఆ హాస్పటల్‌లో ధనాని కంటే ప్రాణానికే

విలువ ఎక్కువ. 'ఎవరు మీరు, ఏ పుట్టుక మీది, ఏ కులస్థులు, ఎంత ధనవంతులు' అన్నది వారికి అనవసరం. అందరూ ప్రాణులే! అందరికీ ఆకలి దప్పులు, బాధ, భయం, ప్రాణంపై తీపి - అన్నీ సమానమే అన్నది వారి అభిప్రాయం.

ఆ మర్నాడు రవి ఏదో ఆపరేషన్ ఉందంటూ థియేటర్‌లోనికి వెళ్ళిపోయాడు. సమీర అవుట్-పేషెంట్స్‌ని చూస్తూంది. పేషెంట్స్‌ని చూడడంలో నైతేనేమి, వారికి బ్రతుకు మీద ధైర్యం కలిగించడంలో నైతేనేమి సమీర చాలా నేర్పరి. పెదవులపై చిరునవ్వు మాయకుండానే పని చేస్తుంది. విసుగు, విరామం అన్న మాటలు ఆమె జీవితంలో ఎప్పుడూ వినలేదేమో, వాటి అర్థాలు కూడా తెలియవేమో అన్నట్లు ప్రవర్తిస్తూంది. అందర్నీ ఓపిగ్గా చూసి పంపించేసింది. ఇంక పేషెంట్సు ఎవరూ లేరు. రవి దగ్గరకు ఆపరేషన్ థియేటర్‌లోకి వెళదామనుకున్నంతలో ఎమర్జెన్సీ కేసు ఒకటి వచ్చింది. ఒక అమ్మాయిని స్పృహలేని స్థితిలో తీసుకొచ్చారు. కేస్ చూడగానే అర్థం అయింది. అబార్షన్ కేస్ అది. అటువంటివి చాలా మామూలే. బహుశా పెళ్ళి కాకుండానే గర్భవతి అయి ఉంటుంది. ఏ నాటు మందో వేసినట్లున్నారు. కేస్ కొంచెం సీరియస్ కండిషన్‌లోనే ఉంది. "ఈ అమ్మాయి తరఫు వారెక్కడ" అని అనేసరికి ఒక నలభై అయిదు సంవత్సరాలావిడ తల వంచుకొని నిలబడి ఉంది. "మీరేనా ఈ అమ్మాయి తల్లి?" అని సమీర అడిగేసరికి తల పైకెత్తిన ఆవిడ సమీర ముఖం చూసి ఒక్కసారి పడగ విప్పిన పాముని చూసినట్లు అప్రయత్నంగా అడుగు వెనక్కి వేసింది. ఆవిడ మొహం చూసిన సమీర కూడా కరెంట్ షాక్ తిన్నట్లయింది. "మీరు...మీరు...నువ్వు...నువ్వు... మీరావికదూ" అంది అతి కష్టంగా. ఆవిడ మాటలు తడబడుతున్నాయి. సమీరను నమ్మలేనట్లు, ఇది అసంభవం అన్నట్లున్నాయి ఆవిడ చూపులు. 'ఇది ఎలా జరిగింది? నేల మీదుండే చెక్కబొమ్మ ఆకాశంలోని చందమామ ఎలా అయింది? ఎప్పుడయ్యింది?' అంతా అయోమయంగా, అపనమ్మకంగా ఉందావిడకు. ఆశ్చర్యంగానూ ఉంది. తెలిసిన అమ్మాయే కాబట్టి తన కూతురును బ్రతికిస్తుందని ఆనందంగానూ ఉంది. ఓడలు బండ్లు, బండ్లు ఓడలవుతాయని వాళ్ళ అమ్మ చెప్పగా విన్న ఆవిడ ఇప్పుడు దాన్ని నిజంగా అనుభవిస్తూంది.

సమీరకు ఆవిడకు సమాధానం చెప్పే అవకాశం కూడా లేదు. ముందు పేషెంటుని చూసింది. కావలసిన ట్రీట్‌మెంట్ ఇచ్చింది. కాని, అమ్మాయి చాలా బలహీనంగా ఉంది. రక్తం ఎక్కించవలసి ఉంది. అప్పుడు బయటకు వచ్చి ఆవిడను చూసింది. పట్టుచీర తప్ప కట్టని చిన్నప్పటి తమ ఎదురింటి మేడ ఆవిడ తనని చీదరించుకుని, చివరికి పురుగుని చూసినట్లు చూసి, ఆ రోజున తరిమి కొట్టినావిడ ఇప్పుడు పాత చీరలో తన ఎదురుగా నేలమీదనే, తనని దేవతలా భావిస్తూ, చేతులు జోడించి, ఆ చేతులతోనే తన చేతులు పట్టుకొంది. "ఇవి చేతులు కావు-కాళ్ళు అనుకోండి" అన్న భావం నీరు నిండిన ఆమె కళ్ళలో కనబడింది సమీరకు.

"చూడండి. నేను మీరానే. పెళ్ళయిన తరువాత మా వారు నా పేరుని సమీరగా మార్చారు. అప్పటికీ, ఇప్పటికీ ఇంకో తేడా కూడా ఉంది. అప్పుడు మీ ఇంటి చెట్లకు సేవ చేశాను. ఇప్పుడు రోగులకు సేవ చేస్తున్నాను. అది సరే! మీ అమ్మాయిని చూశాను. అమ్మాయికి ప్రాణగండం తప్పింది కాని..." అంటూ సంశయాత్మకంగా ఆగిపోయింది సమీర. అలా ఆగిపోవడానికి కారణం ఆమె డబ్బు తీసుకొని రాలేదు అని కాదు-ఆవిడ మనస్తత్త్వాన్ని చిన్నప్పుడే కాచి వడబోసి గ్రహించడమే.

"చెప్పమ్మా చెప్పు. ఏం చెయ్యాలో చెప్పు" అంటూ ఆత్రతగా అడిగింది వరలక్ష్మి. ఆవిడ మొహంలో 'ఇప్పుడు గంగలో దూకమంటే దూకుతాను. నిప్పుల్లో నడవమంటే నడుస్తాను' అన్న భావం కనిపించింది సమీరకు. కాని, ఆ రోజు-ఆవిడ గదులు తుడిచిపెట్టమని అడిగిననాడు-ఆవిడ తుంటరి తనయుడు చెయ్యి పట్టుకున్నాడని, చెంగు లాగాడని ఫిర్యాదు చేస్తే ఎంత చండాలంగా మాట్లాడింది! ఆవిడ తన కొడుకుని సపోర్టు చేసుకున్నందుకు సమీర బాధపడలేదు. తనపై నింద వేసినందుకే కుమిలిపోయింది. "నీవే వాడిమీద పడి ఉంటావు. పైగా ఏమీ ఎరగనిదాని



లా నాకు నంగనాచి కబుర్లు చెబుతున్నావు. మీ సంగతులు నాకు తెలియవు అనుకోకు. షోకులకు డబ్బు కావాలి. అమ్మా, అయ్యా తెచ్చింది తిండికే సరిపోదు. అందుకే డబ్బున్న కుర్రాళ్ళమీద వల విసిరి, డబ్బు గుంజుతారు. మీ కులం వాళ్ళకు శీలం పోయినా ఫరవాలేదు. షోకులు తీరితే చాలు." అంతే. ఆ మాటలతో ఆ నాడు చేతిలోని చీపురుని కూడా అలాగే వదిలేసి ఏడ్చుకుంటూ పరుగెత్తుకొని ఇంటికి వెళ్ళిపోయింది. అప్పటికి పదిహేను సంవత్సరాలు సమీరకు. సెక్స్ అన్న పదమే తెలియదు. కాని, విచిత్రంగా ఆ విషయాన్ని జోడించి, బాగా ఝాడించిం దావిడ. ఆ తరువాత సమీర జీవితం ఎంతో మారినా, ఆనాటి ఆవిడ మాటలను, అహంకారాన్ని మాత్రం మరచిపోలేదు ఇప్పటికీ.

ఆ పల్లెటూరిలో దేవాలయంలోని దేవుడితో సమానంగా వైద్యశాలలోని దంపతులైన ఆ డాక్టర్లు పేషెంట్లను చూస్తున్నారని, వారు తప్పించి ఆ చుట్టుప్రక్కల మంచి డాక్టర్లు ఎవరూ లేరని అందరితో పాటు వరలక్ష్మికి తెలుసుగాని, ఆ డాక్టరే 'మీరా' అని మాత్రం తెలియదు. కాలదన్నిన రాయి తలకు మూల రాయి అవుతుందని అంత కన్నా తెలియదు.

"మీ అమ్మాయికి రక్తం కావాలి. ఆ గ్రూప్ రక్తం ఒకే ఒక కేసులో ఉంది. అది వెంటనే ఇవ్వకపోతే అమ్మాయి బ్రతకడం కష్టం. కాని.." అంటూ మరలా ఆగిపోయింది సమీర. "అమ్మా! మీరమ్మా! నా దగ్గర పైసా లేదు. అమ్మాయి ఉద్యోగం చేసి మమ్మల్ని బ్రతికిస్తూంది. మా ఆస్తి అంతా కోర్టు గొడవల్లో కొట్టుకుపోయింది. అది చస్తే దానితో పాటు మేమూ చావాలి. నీ ఇంట్లో వంటపని చేసి అయినా నీ ఋణం తీర్చుకుంటాను. దాని ప్రాణం కాపాడు, తల్లీ" అంటూ ఘొల్లుమంది. "మీరు తప్పుగా అర్థం చేసుకున్నారు. నాకు డబ్బు ముఖ్యం కాదు-ప్రాణం ముఖ్యం. ఆ రక్తం ఒక రిక్షావాడు అమ్ముకున్నాడు. ఆ కులాన్ని, ఆ పేదవారిని చీదరించుకునే మీరు ఆ రక్తం మీ అమ్మాయికి ఎక్కించమంటారా అని అడుగుతున్నాను" అంది సమీర.

ఆ మాటలు అలా కాకుండా వేరేలా అనిపిస్తున్నాయి వరలక్ష్మి మనసుకు. 'ఆ నాడు నన్ను కులం తక్కువదానివి కాబట్టి గుణం తక్కువదానివి అన్నారు. నేను అప్పుడు ఏ తప్పూ చేయకపోయినా నిందలు పడ్డాను. మరి ఇప్పుడు పెళ్ళి కాకుండా గర్భవతి అయిన మీ కూతురిని ఏ కులంలో చేర్చమంటారు? చదువూ సంధ్యా లేక, తాగి తందనాలాడే మీ అబ్బాయిని ఏ మతంలో చేర్చమంటారు? డబ్బు లేనివారిని దరిద్రులుగా భావించే మిమ్మల్ని ఇప్పుడు ఏ పేరుతో పిలవమంటారు? మనిషి సంస్కారాన్ని బట్టి విలువ ఇవ్వండి-సంపదను బట్టి కాదు. మనిషిలోని రాక్షసత్వాన్ని, నీచత్వాన్ని వెలివేయండి-కులాన్ని కాదు. నీకుంటే నీవు తింటావు. నాకుంటే నేను తింటను. అంతేగాని లేని వారిపై చులకనభావం, ఉన్న వారిపై ఉన్నత భావం పెంచుకోవడం చాలా తప్పు. మానవత్వంతో మనలేవారే నిజమైన ఉన్నతులు' అన్నట్లున్నాయి.

"చచ్చిన పామును ఇంకా చంపకు, తల్లీ. మంచి మనుషుల విలువ ఇప్పుడే కాదు, నా జీవితంలో విధి వక్రించిననాడే తెలుసుకున్నాను" అంటూ కన్నీరు తుడుచుకుంది వరలక్ష్మి. ఆవిడకది కన్నీరైనా, అది మనసు మార్పుతో వచ్చిన కన్నీరు కాబట్టి, అది పన్నీరుగానే భావించి ఆవిడ భుజంపై చేయి వేసి, చిరునవ్వుతో ధైర్యం చెప్పింది సమీర.

'మాటలు రాని మృగాలు సైతం కలసి మెలసి జీవించేను-మాటలు నేర్చిన మానవజాతి మారణహోమం సాగించేను' అన్న పాట చెవుల్లో మారుమ్రోగుతూంది సమీరకు. ★

# ఎ బ్రిడ్జ్ టూ ఫార్

-జి. వి. అమరేశ్వరరావు

**రెండవ** ప్రపంచ సంగ్రామంలో 'ఆర్న్‌హేం' యుద్ధానికి ఎంతో ప్రాముఖ్యం ఉంది. డచ్ దేశానికి చెందిన ఆర్న్‌హేం నగరాన్ని, బయటి ప్రపంచాన్ని కలిపే ఆర్న్‌హేం బ్రిడ్జిని స్వాధీనం చేసుకోవడానికి బ్రిటిష్, జర్మన్ సైన్యాల మధ్య జరిగిన యుద్ధమే ఆర్న్‌హేం సంగ్రామం. 1944 సెప్టెంబర్ నెలలో ఆర్న్‌హేం మీద బ్రిటన్ మిలిటరీ పారా ట్రూప్ దళాలు అకస్మాత్తుగా దాడి చేశాయి. అయితే, బ్రిటన్‌వాళ్ళు ఊహించని రీతిలో జర్మనీకి చెందిన 'పాంజర్ టాంక్ డివిజన్' ఎదురు దెబ్బ తీసింది. ఆ యుద్ధంలో 17,000 మంది బ్రిటిష్ పారా ట్రూపర్స్ మరణించారు.

ఎంతో పకడ్బందీగా పథకం వేసుకుని తాము జరపబోయే మెరుపు దాడి గురించి జర్మన్‌లకు ముందే ఎలా తెలిసిందో బ్రిటన్లకు అర్థం కాలేదు. ఆ తర్వాత కొంత కాలానికి జర్మనీకి, బ్రిటన్‌కు ఒకళ్ళ రహస్యాలు మరొకళ్ళకు అమ్ముతూ డబ్బు సంపాదించే 'కింగ్-కాంగ్' అనే వ్యక్తి చేసిన డబుల్ క్రాస్ వల్ల తమ పథకం ముందుగానే జర్మన్లకు తెలిసిపోయిందని తేలింది.

ఆర్న్‌హేం యుద్ధం జరగడానికి కొన్ని రోజుల ముందు జర్మనీకి, డచ్‌కి మధ్యనున్న ఎవరికీ చెందని భూమి మీద బ్రిటన్ మిలిటరీ దుస్తుల్లో సంచరిస్తున్న కొంత మంది వ్యక్తుల్ని జర్మన్ సైనికులు అరెస్టు చేశారు. అలా అరెస్టయినవారిలో 'క్రిస్టియన్ ఆంటోనియస్ లిండెమాన్స్' అనే వ్యక్తి తనను హాలండ్‌లో ఉన్న జర్మన్ లెఫ్టినెంట్ కర్నల్ 'హెర్మాన్ గిస్కెస్' దగ్గరకు వెంటనే తీసుకువెళ్ళమని కోరాడు.

జర్మన్ సైనికులు డచ్ సరిహద్దు పట్టణమైన వాల్ కెన్స్ వార్డ్ నుంచి ఫోన్లు చేసి లెఫ్టినెంట్ కర్నల్ గిస్కెస్ దగ్గర పని చేసే డిప్యూటీ మేజర్ ఫ్రెడరిచ్ కీసెవెట్టర్‌తో మాట్లాడగలిగారు. కీసెవెట్టర్‌కి లిండెమాన్స్ గురించీ, లిండెమాన్స్‌కూ, లెఫ్టినెంట్ కర్నల్ 'హెర్మాన్ గిస్కెస్'కూ ఉన్న సంబంధాలు బాగా తెలుసు. వెంటనే కీసెవెట్టర్ లిండెమాన్స్‌ను, ఆర్న్‌హేంకు 60 మైళ్ళ దూరంలో ఉన్న 'డ్రిసెబర్గెన్' సిటీలోని కౌంటర్ ఇంటెలిజెన్స్ హెడ్ క్వార్టర్స్‌కు తీసుకువెళ్ళమని ఆదేశం ఇచ్చాడు. వెంటనే లిండెమాన్స్ కౌంటర్ ఇంటెలిజెన్స్ హెడ్ క్వార్టర్స్‌కు చేరుకున్నాడు. అక్కడ

జర్మన్ సైన్యాధికారి గిస్‌కెస్

లిండెమాన్స్‌ని డిప్యూటీ మేజర్ కీసెవెట్టర్ కలిశాడు. ఈ సంఘటన సెప్టెంబరు 15వ తేదీ శుక్రవారం 1944న ఆర్న్‌హేం దాడికి ఖచ్చితంగా 48 గంటల ముందు జరిగింది. లిండెమాన్స్ కీసెవెట్టర్‌కి బ్రిటన్ల పారాట్రూప్ దాడి గురించి చెప్పేశాడు.

* * *

లిండెమాన్స్ గూఢచార వృత్తిని చేపట్టకముందు 1940 వరకూ తన నలుగురు తమ్ముళ్ళతో 'రోటర్‌డాం' నగరంలో నివసించేవాడు. ఆరడుగుల మూడంగుళాల ఎత్తుతో, నిర్జీవంగా వేలాడుతున్న ఎడమ చేతితో లిండెమాన్స్ భీకరంగా కనిపించేవాడు. అతనికున్న విచిత్రమయిన అలవాట్ల వల్ల కింగ్-కాంగ్ అనే పేరుతో లిండెమాన్స్‌ని పిలిచేవారు. 1940 లో జర్మనీకి చెందిన బాంబర్ విమానాల దాడిలో 'రోటర్‌డాం' నగరం నాశనమైంది. ఆ దాడిలో లిండెమాన్స్ సోదరులు నడిపే మోటారు వర్క్‌షాపు కూడా తీవ్రమైన నష్టానికి గురయింది. దాంతో లిండెమాన్స్ సోదరులు దిక్కులేనివాళ్ళయ్యారు. లిండెమాన్స్ పార్కుల్లో పడుకుంటూ అనాథలకు తిండి పెట్టే 'సూప్ కిచెన్స్' అని పిలువబడే భోజన శాలల్లో ఆకలి చల్లార్చుకుంటూ కొన్నాళ్ళు బతికాడు. ఆ రోజుల్లో లిండెమాన్స్‌కు జర్మనీ అంటే విపరీతమైన అసహ్యంగా ఉండేది. కాని, అతను చివరకు తను నాశనం కావడానికి కారణమయిన జర్మన్లతోనే చేయి కలపడం విచిత్రం.

కొంత కాలం దిక్కు లేకుండా గడిపిన లిండెమాన్స్ పెట్రోల్ టాంక్ డ్రయివర్‌గా ఉద్యోగం సంపాదించాడు. అతను తన పెట్రోల్ టాంక్‌తో తరుచు ఫ్రాన్స్‌కు వెళ్ళవలసివచ్చేది. దాంతో డచ్ నుంచి రహస్యంగా ఫ్రాన్స్‌కు పారిపోయేవాళ్ళకు లిండెమాన్స్ ఆధారమయ్యాడు. జర్మన్ ఆక్రమిత ప్రాంతం నుంచి ఫ్రాన్స్ వెళ్ళే జర్మన్ వ్యతిరేక గూఢచారులకు కూడా లిండెమాన్స్ సహాయం చేసేవాడు. ఈ విధంగా రహస్య ప్రయాణాలు చేసేవాళ్ళలో ఫ్రెంచ్ క్యాబరే నర్తకి వెరొనికా, రెడ్‌క్రాస్‌లో డ్రయివర్‌గా పనిచేసే గిలూ అనే 19 సంవత్సరాల యువతీ పరిచయమయ్యారు.